
కథ



# ధర్మయుద్ధం

ఇంద్రగంటి జానకీబాల

మధ్యాహ్నం మాగన్నుగా నిద్రకి ఒరిగినప్పుడు తల్లి కనిపించి కన్నీళ్లు పెట్టుకున్న దృశ్యం. ఉలిక్కిపడి లేచింది రేవతి. ఎల్లుండి తన పుట్టినరోజని అమ్మ చెప్పినట్లుగా అనిపించింది. ఎప్పుడో మర్చిపోయిన పుట్టినరోజు అకస్మాత్తుగా గుర్తుకు రావడం ఆశ్చర్యం కలిగించింది.

తలుపు ఎవరో కొడుతున్నారు. కరెంట్ పోయినట్లుంది ఫ్యాన్ ఆగిపోయింది. కాలింగ్ బెల్ మూగబోయింది. తలుపు మీద మళ్లీ ఎవరో కొట్టినట్లయింది.

రేవతి నెమ్మదిగా లేచి ముఖం, మెడ, మోచేతులు చెమట పట్టి వుంటే కొంగుతో తుడుచుకుంటూ వెళ్లి, తలుపు తీసింది. ఎదురుగా పార్వతమ్మ నిలబడి వుంది. ''రండి పిన్నీ'' అంటూ లోపలికి వెనుతిరిగింది.

తల్లి పోయినప్పట్నించీ, పార్వతమ్మే రేవతికి పెద్ద దిక్కు. కాఫీ కలిపి ఇచ్చి, ''ఏమిటి పిన్నీ చెప్తానన్నారు?'' అంది, తనూ కాఫీ కప్పు తీసుకుని ఎదురుగా కూర్చుంటూ.

''ఎలాగైనా నువ్వు పెళ్లి చేసుకుని ఓ ఇంటి దానవవ్వాలి రేవతీ!'' అందామె.

రేవతి నవ్వింది. ''మీకు నా మీదెంతో అభిమానం. అందుకే అలా అంటున్నారు. కానీ ఆ మాట మర్చిపొండి'' అంది.

''కాదు. నేనో ముఖ్యమైన విషయం చెప్పడానికే వచ్చాను'' అందామె.

రేవతి గుండెలు గుబగుబలాడాయి. ఏమిటీమె చెప్పబోయే విషయం? ఏమిటీ అన్నట్టు చూసింది పార్వతమ్మ వైపు.

''భాస్కరంగారు తెలుసు కదా!'' అంది.

''భాస్కరం మాష్టారేనా?'' అంది రేవతి.

''అవును అయనే-తెలుసు కదా, ఆయన పెళ్లి చేసుకుందామనుకుంటున్నాడు. మొన్ననే రిటైరయ్యాడు-అరవై దాటాయి. నువ్వు సరే అంటే నిన్ను చేసుకుంటాడు'' అంటూ ఆగింది పార్వతమ్మ.

రేవతి ఏదో చెప్పబోయింది.

''నువ్వు చిన్నపిల్లవేం కాదు. ఎల్లుండి నీ పుట్టిన్రోజు. నలభై వస్తాయి.''

అమ్మలాంటి ఈమెకి, తన పుట్టినరోజు గుర్తుందంటే చిత్రంగా అనిపించింది.

''నాకిప్పుడు పెళ్లేంటి పిన్నీ?'' అంది తేలికగా.

''అలాగనకు. నీకంటూ ఒక ఇల్లూ-వాకిలీ, కాస్త డబ్బు, స్వేచ్ఛా, స్వతంత్రం వుండాలి. ఏది కావాల్సినా దర్జాగా నీ చేత్తో నువ్వు ఖర్చు పెట్టుకోవాలి. అవన్నీ నీకుంటాయి, నా మాట వింటే...''

''అంతా నీ ఇష్టం లాగే చెప్పేస్తున్నావ్...!'' అంది.

''నా ఇష్టం కాదు. ఆయనే నోరు విప్పి అన్ని సంగతులూ చెప్పాడు'' అని గొంతు తగ్గించి, ''ఇప్పుడతనికి పన్నెండువేలు పెన్షనొస్తుంది. ఎటు తిరిగెట్టైనా, నీకు జీవితాంతం హాయిగా గడిచి పోతుంది. ఇల్లుంది-''

ఇవన్నీ వ్యాపారపు ఒప్పందాలు... రేవతి తల తిరిగింది. పైకేమీ మాట్లాడలేదు. ఉలిక్కిపడింది. ''ఛీ, అవన్నీ ఎందుకు పిన్నీ?'' అంది.

''అవే కావాలి. ఇక్కడ చూడు. రెక్కలు ముక్కలు చేసుకున్నా నీ చేతిలో పైసా ఉండదు. జీతంగా నువ్వడగలేవు. వాళ్లివ్వరు. పోనుపోను నీకు ఓపిక లేకపోతే కప్పు కాఫీ ఇచ్చేవాళ్లుండరు'' పార్వతమ్మ మాటలు సాగుతూనే ఉన్నాయి.

రేవతికి కొన్నే వినిపిస్తున్నాయి-వేరే ఆలోచనలు ముసురుతున్నాయి.

జీవితం ఒక పెద్ద వ్యాపారసంస్థ. రకరకాల వ్యాపారాలు ఇందులో నడుస్తుంటాయి. అందులో పెళ్లి అనేది ప్రధానమైన వ్యాపారం. ఎన్నో లావాదేవీలు ఈ వ్యవహారంలో సాగుతూంటాయి.

''ఏమిటీ, వింటున్నావా?'' అందామె.

రేవతి ఉలిక్కిపడింది. ''ఆ... ఆ...'' అంది.

అయితే ఆమె ఊరుకోలేదు. ''కాస్త చాదస్తుడే గానీ, చెడ్డవాడేం

కాదు. భార్య పోయి పదేళ్లు దాటింది. తోడుగా, తనని చూసుకునే ఆడదిక్కు కావాలని, కంచంలోకి ఇంత అన్నం వస్తుందని ఆశపడుతున్నాడు."

ఇచ్చిపుచ్చుకునే వ్యాపారసంస్కృతికి ఇదొక ప్రతీక. పడి వుండి పనిచేసే మనిషి- భార్య రూపంలో వుండాలి.

పాతికేళ్ల క్రితం, రేవతి పదిహేనేళ్ల పిల్ల. పదో క్లాసు ప్యాసయి ఉత్సాహం వురకలు వేస్తూ ఏదో చేసేద్దామనుకునేలోపు, బొమ్మగా వున్న జీవితం బొర్లుసైపోయింది. తండ్రి యాక్సిడెంటులో చనిపోవడం, ఆ బెంగతో తల్లి మంచమెక్కడం-రేవతి పెద్దపిల్ల కావడం-తమ్ముడ్ని, చెల్లెల్ని-మంచం దిగలేని తల్లినీ సంరక్షించవలసిన బాధ్యత మీద పడిపోవడం-ఆమెకు పదేళ్ల వయసుని మీద పడేశాయి. ఇంటి పనులు, బయట పనులు చేస్తూ, ఆర్థిక పరమైన ఇబ్బందుల వల్ల, ఎలిమెంట్రీ స్కూల్లో చిన్న జీతానికి టీచరుగా డబ్బు సంపాదించి కుటుంబాన్ని నడిపించవలసిన స్థితి-వచ్చీరాని చదువుతే, చాలీచాలని జీతానికి జీవితం తాకట్టు. ఆ తర్వాత అంతా పాత కథే.

"కానీ...పిన్నీ ఇదంతా నాకెలాగో వుంది- అలాంటి విషయాలు ఆలోచించే స్థితిలో లేను."

"నువ్వూరుకో-నీ మంచి కోరేదాన్నని నా మీద నమ్మకం వుంది కదా!" సూటిగా కళ్లల్లోకి చూసి అడిగే సరికి, రేవతి తడబడింది.

"అయ్యో పిన్నీ! మీకంటే నాకెవ్వరూ లేరని మీకు మాత్రం తెలీదా?" అంది.

"అందుకే నే చెప్పినట్టు విను- అయినా నువ్వొ ఈ రాత్రి ఆలోచించుకో-, సానుకూలంగా ఆలోచించు. అతని వల్ల నీకొచ్చే కష్టమేం వుండదు" అని, కొంచెమాగి, "మొన్న జరిగినది చూశాక, నేను మరీ ఇదైపోయాను" అంది పార్వతమ్మ చివరగా.

రేవతి మనసులోనూ మొన్న జరిగిన అవమానం ఒక్కసారి భగ్గు మంది. పెళ్లి అనే విషయం ఆమె ఆలోచన జీర్ణించుకోలేకపోయి నా, తనకేమాత్రం గౌరవం లేని చోట వుండకూడదు అనిపించింది. "మీ మాట మీద గౌరవం, నమ్మకం తప్పిస్తే నాకీ వ్యవహారం మీద పెద్దగా ఇంట్రస్టు కలగటం లేదు" అంది.

"కలిసివస్తే, అన్ని ఇంట్రస్టులూ అవే వస్తాయి" అంటూ "ఊc" అనిపించి మరీ వెళ్లింది పార్వతమ్మ.

000

పాతికేళ్ల క్రితం, రేవతి పదిహేనేళ్ల పిల్ల. పదో క్లాసు ప్యాసయి ఉత్సాహం వురకలు వేస్తూ ఏదో చేసేద్దామనుకునేలోపు, బొమ్మగా వున్న జీవితం బొర్లుసైపోయింది. తండ్రి యాక్సిడెంటులో చనిపోవడం, ఆ బెంగతో తల్లి మంచమెక్కడం-రేవతి పెద్దపిల్ల కావడం-తమ్ముడ్ని, చెల్లెల్ని-మంచం దిగలేని తల్లినీ సంరక్షించవలసిన బాధ్యత మీద పడిపోవడం-ఆమెకు పదేళ్ల వయసుని మీద పడేశాయి. ఇంటి పనులు, బయట పనులు చేస్తూ, ఆర్థిక పరమైన ఇబ్బందుల వల్ల, ఎలిమెంట్రీ స్కూల్లో చిన్న జీతానికి టీచరుగా డబ్బు సంపాదించి కుటుంబాన్ని నడిపించవలసిన స్థితి-వచ్చీరాని చదువుతో, చాలీచాలని జీతానికి జీవితం తాకట్టు. ఆ తర్వాత అంతా పాత కథే. తమ్ముడు బాగా చదువుకుని, మంచి ఉద్యోగం సాధించి, దండిగా కట్నం తీసుకుని పెళ్లి చేసుకున్నాడు.ఎమ్.సి.ఏ చేసిన చెల్లెలు, ఉద్యోగంలో చేరిన మూడు నెలలకే కొలీగ్‌ని ప్రేమించి పెళ్లి చేసుకుని ఆనందంగా స్థిరపడిపోయింది.

తల్లి దాటిపోయింది. రేవతికి పెళ్లి వయసూ దాటిపోయింది. తమ్ముడి పిల్లల్ని కొంత కాలం, చెల్లెలు పిల్లల్ని కొంత కాలం సాకి, వాళ్లు స్కూలుకెళ్లే స్థితికి తీసుకొచ్చింది. ఈ సేవల్లో, వున్న ఆ చిన్న ఉద్యోగం కాస్తా ఊడిపోయింది.

ఉద్యోగం ఊసు వచ్చినప్పుడల్లా "నీకా ఉద్యోగం లేకపోతేనేం-మేం ఇస్తాంలే ఆ జీతం!" అని ప్రగల్భాలు పలికినవారు పైసల దగ్గర మహా గట్టిగా వుండేవారు. ఎప్పుడు రేవతికి డబ్బు అవసరం వచ్చినా, వంద లెక్కలు కట్టి, వేయి ఆరాలు తీసి, చివరికి అసంతృప్తి ముఖాలతో అనుకున్న దానిలో సగం చేతిలో పెట్టి 'మళ్లీ యిస్తాంలే' అంటూ గడుపుతున్నారు.

000

ఆ రోజు పార్వతమ్మ ఇంట్లో రేవతిని కలిసి, భాస్కరం మాట్లాడాడు.

"ఇదిగో అమ్మాయీ-ఈ వయసులో పెళ్లేమిటి? అని అందరూ, ఆక్షేపిస్తారు. నిజమే. కానీ వయసు పెరుగుతున్నకొద్దీ నాకూ ఒక తోడు కావాలని పిస్తోంది. నువ్వంటే నాకు అభిమానం. నీకూ ఒక నీడ కావాలని భావించాను. అందుకే మా పార్వతమ్మక్కయ్యతో విషయం చెప్పాను. నువ్వు నాకు ఇల్లూ వాకిలీ చూసి పెట్టి, ఇంత అన్నం వండి పెడతావని ఆశ. అంతకు మించేమీ లేదు. నేను లేవలేకపోతే సేవ చేస్తావు. కాస్త జావకాచి పోస్తావు. నాకు పిచ్చి పిచ్చి ఆలోచనలుంటే ఎప్పుడో ఓ చిన్నదాన్ని చూసి పెళ్లాడే వాడ్ని. మా ఆవిడ పోయిన ఏడాదికి చాలామంది వచ్చారు పిల్లనిస్తామని. నాకిష్టం లేకనే చేసుకోలేదు-ఇదిగో చూడు నువ్వు నాకు తోడు. నేను నీకు నీడ-నువ్వు నాకు సేవ చేస్తావు. నేను నీకు రక్షణ యిస్తాను. స్టేటస్ యిస్తాను. నా భార్య స్థానం యిస్తాను. నాకు మరీ చిన్నపిల్లని చేసుకోవడం ఇష్టం లేదు. నువ్వు కష్టసుఖాలు తెలిసినదానవు. పార్వతమ్మక్కయ్య నిన్ను గురించి అంతా చెప్పింది. నాకు ఇద్దరు మగపిల్లలు-ఒకడు అమెరికా-రెండోవాడు ఆస్ట్రేలియా-వాళ్లొచ్చి నన్ను చూసేది లేదు. నేను వాళ్ల దగ్గరికి వెళ్లేదీ లేదు" భాస్కరం గుక్కతిప్పుకోకుండా మొత్తం సంగతులన్నీ వివరంగా చెప్పాడు. చాలాసేపు మాట్లాడి, చివరికి ఆమె పెట్టిన ఫలహారం తిని, కాఫీ తాగి వెళ్లిపోయాడు.

రేవతి అన్నీ వింటూ కూర్చుంది. ఆమె మాట్లాడిందేమీ లేదు. "ఊ...ఆ... అవును-నిజమే-"లాంటి మాటలు చెప్పింది. అంతే.

"అతనటూ ఇటూ అయినా సగం పెన్షనొస్తుంది. నువ్వున్నంత కాలం ఎవర్నీ దేహీ అనక్కరలేదు. ఉన్న ఫ్లాట్ నీ పేర రాయించే పూచీ నాదీ!" పార్వతమ్మ ముక్తాయింపు యిచ్చి వదిలింది.

పార్వతమ్మ మాటల్లోని అప్రస్తుతులను పక్కకి పెట్టి, రేవతి ఒక్కటే అనుకుంది. తను సాహసించి ఒక్కర్తీ బతకటానికి బయట కెళ్లలేదు-, ఇంట్లోంచి బయటపడటానికిదో మార్గం-!

రేవతి అంగీకారం తెలిపింది. ఇంట్లో తమ్ముడు-చెల్లెలు అవాక్కయిపోయారు. మరదలు నోరు మెదపలేదు. మరిది మాత్రం "ఎవరి జీవితం వారిది. ఆమె ఇష్టం ఆమెది" అన్నాడు.

వారం రోజుల్లో వేంకటేశ్వరస్వామి గుడిలో వారి పెళ్లి చాలా నిరాడంబరంగా జరిగిపోయింది. అటూ, ఇటూ అందరూ కలిసి పదిహేనుమంది వున్నారు.

మరదలు ఒక బెంగాల్ కాటన్ చీర కొనిచ్చింది, ఆడబడుచుకి. పార్వతమ్మ ఆశ్చర్యంతో నోరు తెరిచింది. చెల్లెలు మాత్రం కంచి పట్టుచీర కొనిచ్చింది.

భాస్కరం మాష్టారితో కలిసి ఆ ఇంట్లో అడుగుపెడుతుంటే రేవతికి చాలా చిత్రంగా అనిపించింది. ఇది కలా-నిజమా అనే అనుమానం కలిగింది. ఈ ఇల్లు తన సొంతం అనుకున్నప్పుడు చిన్న ఆనందం.

అందరికీ ఇంట్లో భోజనాలు ఏర్పాటు చేసింది పార్వతమ్మ.

ఇంట్లోకి వస్తూనే భాస్కరం లెక్చరింగ్ మొదలుపెట్టాడు. అతను మాట్లాడటం మొదలుపెడితే, ఓ పట్టాన వదలడు. తను అనుకున్న వన్నీ వివరంగా చెప్పేగానీ వదలడు.

"ఇదిగో చూడండి-నే చెప్పే ఈ నాలుగు మాటలు, మీ నలుగుర్రైనా వింటే నాకో తృప్తి. ఆమె నాకు తోడు-నేను ఆమెకు నీడ అంతే-,అంతకు మించేమీ లేదు. చూశారా ఈ మంచాలు, ఆ మూలొకటి ఈ మూలొకటి. వేరే చెడు భావాలతో నేనీ పెళ్లి చేసుకోలేదు. ఆమెకి నా భార్య స్టేటస్ ఇచ్చాను. ఒక పునిస్త్రీగా గుర్తింపు కలగజేశాను. ముత్తయిదువుగా ఆమె సమాజంలో కళకళ లాడుతూ తిరిగే వసతి, స్థాయి కలిగించాను. అదే నా కోరిక. రేపు ఓ శ్రావణమంగళ వారం నాడు ఆమె గౌరీదేవి-ఓ శుక్రవారం నాడు ఆమె వరలక్ష్మీదేవి. ఆ మంగళసూత్రాలు-ఆ నల్లపూసలు, ఆ మట్టెలు ఆమె అస్తిత్వచిహ్నాలు. అదే నా కోరిక..."

ఇలా సాగింది అతని ధోరణి. అతనెంతసేపూ స్త్రీ భర్తకి చేయవలసిన విధుల గురించి, పాతివ్రత్యం అంటే ఏమిటి? అంటూ వివరించి, ఉత్తమ ఇల్లాలి లక్షణాలు పదేపదే చెప్పిచెప్పి వదిలాడు. అక్కడున్న ఆ కాస్తమందీ ఇబ్బందిపడిపోయారు. ముఖాలెలా పెట్టాలో అర్థం కాక అవస్థపడుతున్నారు.

"ఆ మంచాలు చూశారు కదా, ఒకటి ఆ పక్కా, ఇంకొకటి ఈ పక్కా-"

కొందరికి ఒళ్లు మండిపోయింది. అయినా మర్యాద కాదని వూరుకున్నారు.

రేవతి మాత్రం, భోజనాల ఏర్పాటులో పార్వతమ్మకి సహాయం చేస్తూ లోపలే ఉండిపోయింది.

పార్వతమ్మ మాత్రం కర్ణాకర్ణిగా వింటూనే ఉంది, అన్నీ సర్దేసి వచ్చేసి, "లేలే తమ్ముడూ! వడ్డన పూర్తయింది. అందరూ ఆకల్ల మీదున్నారు. కబుర్లు తర్వాత" అంటూ అందర్నీ లేపింది.

బతుకు జీవుడా అని అంతా లేచారు.

సాయంత్రం ఇంటికి వెళ్తూ రేవతిని పక్కకి పిలిచి, "చాదస్తుడే గానీ, మనిషి మంచివాడే. భయం లేదు. నువ్వు మరీ ముంగిలా మాట్లాడకుండా ఉండకు. కాస్త మాట్లాడితేనే కదా అన్నీ తెలిసేది!" అంటూ హితబోధ చేసి వెళ్లింది పార్వతమ్మ.

భాస్కరం ఇల్లంతా అటూ ఇటూ తిరిగాడు.

రేవతి శుభ్రంగా ఇల్లంతా సర్దింది. ఏడు గంటలకి వంట చేసింది. అతను స్నానం చేస్తానంటే వేడినీళ్లు పెట్టిచ్చింది.

"ఊ...ఆ..." అనే మాటలు తప్ప, వాళ్ల మధ్య పెద్దగా మాటలేం సాగలేదు. భాస్కరం మాత్రం స్వగతంగా, సమాజం గురించి, స్త్రీ గురించి, వాళ్ల నడవడిక గురించి, తన నిస్స్వార్థం గురించి ఏవేవో మాట్లాడుతూనే వున్నాడు.

అన్నం తిని వంట మెచ్చుకున్నాడు. "ఈ మధ్యకాలంలో ఇలాంటి భోజనం చెయ్యలేదు" అంటూ లేచాడు.

రేవతికి ఆనందమేసింది. చేసిన పని బాగుందని మెచ్చుకుంటే ఎవరికైనా సంతోషమే కదా! రేవతి ఇల్లు సర్దుకుని వచ్చేసరికి, రెండు మూలలున్న మంచాలు రెండూ, ఒకటిగా చేశాడు భాస్కరం.

రేవతి అయోమయంలో పడింది. కానీ నోరు మెదపలేదు. ఈ మనిషిని ఎలా అర్థం చేసుకోవాలో అనే ఆలోచనలో పడింది.

"ఇలా వచ్చి కూర్చో" అన్నాడు.

రెండు-మూడుసార్లు పిలిచాక నెమ్మదిగా వెళ్లి మంచం మీద కూర్చుంది.

ఆమె కూర్చోగానే ఆమె గుండెల మీద చెయ్యి వేసి వెనక్కి తోశాడు. ఆమె వెల్లకిలా పడింది. అంతే-అతని శరీరం మొత్తం ఆమెని కప్పేసింది. ఉక్కిరిబిక్కిరైన ఆమె ఏం మాట్లాడలేకపోయింది. అంతలోనే అతను పనిలో పడిపోయాడు. చేతులూ, కాళ్లూ, నోరూ, పెదవులు విశ్రాంతి లేకుండా చకచకా చలించిపోతున్నాయి. అంతవరకు మగస్పర్శ ఎరుగని రేవతికి ఊహకందని విధంగా అన్నీ జరిగిపోయాయి. పెళ్లి అని చేసుకున్నాక, ఏం జరుగుతుందో ఊహించలేనంత అమాయకురాలు కాదు రేవతి. కానీ అతని మాటలకీ-చేతలకీ పొంతన లేకపోవడం ఆమె అర్థం చేసుకోలేకపోతోంది.

అప్పట్నించీ తెల్లవారగానే మంచాలు వేరువేరుగా దూరంగా జరపడం భాస్కరం మొదటి పనైంది-రెండోపని ఏమిటంటే ఎవరింటికొచ్చినా భార్యభర్తల మధ్య ఉన్నది అమలిన శృంగారమే తప్ప మరోటి కాదని గంటలు గంటలు లెక్చర్లివ్వడం. వచ్చిన వారికి ఆశ్చర్యం-రేవతికి అసహ్యం రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ఎవరూ ఏమీ అడక్కపోయినా, 'మంచాల' వ్యవహారం మాట్లాడకుండా అతనుండడు-ప్రత్యేకంగా అదే ప్రస్తావన అతని పిచ్చి.

చూసి చూసి ఒక రోజు పెద్ద పోట్లాట వేసుకుంది రేవతి. "మీరు నన్ను పెళ్లి చేసుకున్నారు కదా! వచ్చినవాళ్లందరికీ మన మధ్య ఏం లేదని చెప్పడమెందుకు?" అని అరిచి గొడవచేసింది.


"అందరూ నన్ను తక్కువగా చూస్తారు. ఈ వయసులో వీడికి పెళ్లాం కావాల్సి వచ్చిందా అని నవ్వుతారు" అన్నాడు.

"నిజంగా కావాల్సి వచ్చింది కదా-అయినా ఎవరూ మిమ్మల్ని మంచాల గురించి అడగనప్పుడు, వచ్చిన ప్రతీవాళ్లకి మీరెందుకు కూర్చోబెట్టి చెప్తారు?"-అరిచింది.

"ఇదిగో మళ్లీ విను. నువ్వంత చిన్నతనం ఫీలవ్వాల్సిందేం లేదు. నువ్వు నాకు తోడు. నేను నీకు నీడ. నీకు నా భార్యగా స్థానం కల్పించాను నువ్వు నాకు సేవచేసుకుంటున్నావు. ఇంతకు మించి మాట్లాడితే వూరుకోను" అంటూ రగడ చేశాడు-

ఇతనికేమైనా పిచ్చా అనుకుంది. "చంపేస్తాను!" అంటాడు కానీ, దగ్గరకి రాడు. ఒంటి మీద ఒక్క దెబ్బ వెయ్యడు. దూరంగా చిందులు తొక్కుతాడు. పనికిరాని వాదమేదో చెప్తాడు-వినకుండా వుండే వీలు కూడా వుండదు.

"ఇదిగో ఇలా చూడు. నా మాటలు



వినకుండా తప్పించుకుందా
మంటే కుదరదు. చంపేస్తా!" అంటాడు.

ఆ క్షణంలో రేవతికి భయమేస్తుంది. కానీ అతనామె దగ్గరికి రాడు.

ఈ దేశంలో స్త్రీకి వివాహం ఒక జీవనోపాధి. ఆమె బ్రతుకు గడవటానికి పెళ్లి చేసుకోవాలి. భర్త పోషిస్తాడు. కూడూ-గుడ్డా, ఇల్లు, వాకిలీ ఇస్తాడు. దానికి ఆమె అతనికి చాకిరీ చేస్తుంది. సుఖాన్నిస్తుంది. పిల్లల్ని కంటుంది. పెంచుతుంది. కొట్టినా, తిట్టినా నోరెత్తదు. బానిసలా పడి వుంటుంది-

రేవతి ఆలోచిస్తుంటే తన మీద తనకే చిరాకుగా, కోపంగా వుంది. ఏదో విధంగా తను ఒంటరిగా బ్రతకగలననుకోలేదు. ఏదో భయం.

తమ్ముడి సంసారంతో కలిసి వుంటే, తనేదో వాళ్ల రక్షణలో వున్నట్టు ధైర్యం. అక్కడి అవమానాల్లోంచి ఇక్కడ రక్షణ అనే నరకంలోకి పడింది. అంతే గానీ తను స్వతంత్రంగా స్వేచ్ఛగా ఉందామనుకోలేదు. ఎందుకు? ఏదో భయం.

హింసల్లో రకరకాల హింసలుంటాయి. ఇది మాటలతోనే హింస, వాగుడుతో హింస. అతనొక సూడో కల్చర్ పిచ్చిలో వుంటాడు. ముఖ్యంగా ఆడవాళ్లు ఇలా వుండాలి అని ఒక అభిప్రాయం ఆ అభిప్రాయానికి సంస్కృతి అనే రంగు పులుముతాడు.

"ఇంకాస్త బొట్టు పెద్దదిగా పెట్టుకో..."

"నువ్వు గుంటూరు జరీ చీరలలో ఎంతో హుందాగా వుంటావు. కుర్రదానిలా సిల్క్‌చీరలు వద్దు" అంటాడు.

చూసేవాళ్లంతా రేవతి మెడలో మూడు పేటల పలకసరులు, లావుపాటి సూత్రాల గొలుసు-రెండు వరసల నల్లపూసలు-చేతులకున్న బంగారు గాజులు చూసి, ఆమె జాతకం తిరగబడి పోయిందని భావిస్తూవుంటారు.

ఇదే రక్షణ-ఇదే తోడు నీడా-ఇదే సంసారం-ఇదే స్త్రీ జీవితానికి పరమావధి అని సరి పెట్టుకోవాలంటే రేవతికి ఊపిరి ఆడటం లేదు. మూడు నెలల్లో మూడు జన్మల అనుభవం వచ్చినట్ల నిపించింది.

"ఏమిటా మొద్దు నిద్ర-లే-లే-సంసారైన ఆడది సూర్యుడు దయించకుండా లేవాలి!"

భాస్కరం మాటలతో లేచింది రేవతి. లేస్తుంటేనే కళ్లు తిరిగాయి. కడుపులో వికారం తిప్పేసింది. పదిరోజులుగా మనసులో పట్టిపీడిస్తున్న అనుమానం, ఒక్కసారి పెను భూతమై భయపెట్టింది.

000

డా॥ రాజేశ్వరి అంతా విన్నది. రేవతికి చిన్ననాటి స్నేహితురాలు రాజేశ్వరి. అందువల్ల రేవతి వైద్యపరమైన విషయాలే కాకుండా, సంసారం గురించి కూడా స్నేహితురాలితో మనసువిప్పి చెప్పింది-

"అయితే ఇప్పుడేం చేద్దామనుకుంటున్నావ్?" అందామె.

"ఆయన అబార్షన్ చేయించుకోమని చంపుకుతినేస్తున్నాడు. నాకు మాత్రం బిడ్డని కనాలని వుంది."

"గుడ్! అయితే హాయిగా బిడ్డని కనిపెంచుకో!"

"కానీ-నేను వొంటరిగా ఏం చెయ్యలేనుగా?"

"పిచ్చిగా మాట్లాడకు-భయపడుతూ కూర్చుంటే భయమే. ముఖ్యంగా స్త్రీలు వున్నచోటనే వుండి వాళ్ల హక్కుల కోసం ధైర్యంగా పోరాడి గెలవాలి గానీ, ఇక్కడ కాదని అక్కడికీ, అక్కడ కాదని మరో చోటికీ తిరుగుతూవుంటే, ఎక్కడైనా నిన్ను భయపెట్టి తరిమికొట్టేవారుం టారు. ఇప్పుడు నువ్వు ఇంట్లో నీకు సర్వ హక్కులూ వున్నాయని గ్రహించుకో-,అక్కడికి పోతాను. ఇక్కడికి పోతానూ, అనకు."

"ఇది సాధ్యమేనా?"

"ఆ... సాధ్యమే-నేను నీకు పూర్తి సాయం చేస్తాను. మెడికల్‌గా నేను చూసుకుంటాను. నీ వయసు వల్ల ఓ మూడు నెలలు బెడ్ రెస్ట్ అవసరం కావచ్చు." మళ్లీ రాజేశ్వరే అంది, "ఇన్నాళ్లూ నీ కోసం బతికావో-లేదో ఇప్పుడు మాత్రం నువ్వు కనబోయే బిడ్డ కోసం బతుకు. అదీ ధైర్యంగా బతుకు. నీకేం పరవాలేదు"-

రేవతి నిటారుగా లేచి నిలబడింది.

000

"నీకు వందసార్లు చెప్పినా బుర్రకెక్కడం లేదే? నాకు నువ్వు-నీకు నేను తోడునీడగా వుండాలని పెళ్లి చేసుకున్నానుగానీ, నీతో పిల్లల్ని కని, ఉయ్యాలలూపి జోలలు పాడటా నికి కాదు!" భాస్కరం గొంతు పై స్వరంలో వుంది.

ఆ స్థాయిలో అతనికి జవాబు చెప్పాలనీ అనిపించలేదు-మౌనంగా వుండాలనీ అనిపించ లేదు. ఒక్కసారి రాజేశ్వరి మాటలు గుర్తుకొచ్చాయి. మాట్లాడకుండా కూర్చోకూడదు. స్తబ్దత వదిలి చైతన్యం తెచ్చు కుంది రేవతి.

"మీరు గట్టిగా అరవకండి! మీరు చెప్పినట్టు అబార్షన్ చేయించుకోను. బిడ్డను కంటాను!" ఆమె మాటలు స్థిరంగా వున్నాయి.

"వీల్లేదు!"

"మీరెవరు వీల్లేదనడానికి? పిల్లల్ని కనాలో వద్దో నిర్ణయించుకునే అధికారం తల్లికే వుంది, తెలుసా?"-

"అదేం కుదరదు! నే నొప్పుకోను. నాకింత వండి పెడతావనీ, లేవలేకపోతే సాయంగా వుంటావనీ చేసుకున్నాను గానీ..." అతని మాట పూర్తి కాకుండానే, "చాలింక! అదే పనిగా మళ్లీ మళ్లీ అవే మాటలు చెప్పకండి!" ఆమె కంఠమూ పైకి లేచింది.

"అది కాదు. చెప్పింది అర్థం చేసుకోవేం?" అతని గొంతులో సంకోచం-

రేవతి కళ్లు మూసుకుని కుడి చెయ్యి పైకెత్తి, అరచెయ్యి చూపిస్తూ, "ఆపండి! మాటలొద్దు!" అంది.

భాస్కరంలో చిన్న భయం లాంటిది కలిగి, ఒక అడుగు వెనక్కి వేశాడు.

అంత వరకు తలుపు దగ్గర నిలబడి వున్న పార్వతమ్మ అంతా వింది. "ఆడదానికి ధైర్యం లేకపోతే బతుక్కురావడం మహాకష్టం. రేవతికి నేను లేనా ఏమిటి అండగా?" అనుకుంటూ, ఏమి ఎరగనట్టు లోపలికి అడుగుపెట్టింది పార్వతమ్మ.

"అయితే ఇప్పుడేం చేద్దామనుకుంటున్నావ్?" అందామె. "ఆయన అబార్షన్ చేయించుకోమని చంపుకు తినేస్తున్నాడు. నాకు మాత్రం బిడ్డని కనాలని వుంది."
"గుడ్! అయితే హాయిగా బిడ్డని కనిపెంచుకో!"
"కానీ-నేను వొంటరిగా ఏం చెయ్యలేనుగా?"
"పిచ్చిగా మాట్లాడకు-భయపడుతూ కూర్చుంటే భయమే. ముఖ్యంగా స్త్రీలు వున్నచోటనే వుండి వాళ్ల హక్కుల కోసం ధైర్యంగా పోరాడి గెలవాలి గానీ, ఇక్కడ కాదని అక్కడికీ, అక్కడ కాదని మరో చోటికీ తిరుగుతూవుంటే, ఎక్కడైనా నిన్ను భయపెట్టి తరిమి కొట్టేవారుంటారు. ఇప్పుడు నువ్వు ఇంట్లో నీకు సర్వ హక్కులూ వున్నాయని గ్రహించుకో-,అక్కడికి పోతాను. ఇక్కడికి పోతానూ, అనకు."